క్లుప్తంగా

అర్హులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎస్ఆర్పీ పున్నపు నాయుడు

సారవకోట: అర్హులందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ పున్నపు నాయుడు సూచించారు. మండలంలోని కిడిమి, గొర్రిబంద గ్రామాల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ పల్లి సావిత్రి, పంచాయితీ కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులున్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి



తయారు చేసిన వంటలను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

మెళియాపుట్టి: వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు అన్నారు. మండలంలోని బందపల్లి, పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ అమలు తీరు, అదేవిధంగా వసతి గృహంలో విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు, తాగునీరు ఇతర సదుపాయాలు పరిశీలించారు. మెనూ అమలులో ఎటువంటి మార్పులు ఉండకూడదని, విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ఇబ్బందులు ఎదురుకాకూడదన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఆయనతో పాటు పలువురు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతాప్

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షలను నిర్వహించామని కంటి డాక్టర్ డి.ప్రతాప్ తెలిపారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు కళ్లద్దాలను ఉచితంగా ఇస్తామన్నారు. విద్యార్థులు కంటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రామారావు, వైద్య సిబ్బంది ఎస్.కిరణ్ కుమార్, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పగటి వేషధారణలు



పగటి వేషధారణల్లో యువకులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి గ్రామంలో నందెన్న సంబరాలు సందర్భంగా శుక్రవారం ప్రదర్శించిన పగటి వేషధారణలు అకట్టుకున్నాయి. గౌరీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా గ్రామంలో నందెన్నను ఏర్పాటు చేశారు.

సక్రమంగా మెనూ అమలు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తూరు: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ డిప్యూటీ డీఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబులు సూచించారు. మండలంలోని గొట్టిపల్లి గిరిజన బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగ శుక్రవారం సందర్శించారు. త్వరలో నిర్వహించనున్న ఎస్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందుతున్న పలు రకాల పథకాలు అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయడంతో పాటు నాణ్యమైన భోజనాలు పెట్టాలని ఆదేశించారు.

తుంగతంపరలో రెవెన్యూ గ్రామసభ

హిరమండలం: మండలంలోని తుంగతంపర గ్రామంలో శుక్రవారం మండల రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన సమగ్ర భూసర్వేలో ఉన్న లోటుపాట్లును సవరించేందుకు రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతురావు, రీసర్వే డీటీ నీలమ తదితరులు పాల్గొన్నారు.

నీరుగారిన నిషేధం..!



అప్పట్లో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లను కాల్చుతున్న దృశ్యం(ఫైల్)

- అమలుకాని పాలిథిన్ నిషేధం
- నరసన్నపేటలో యథేచ్ఛగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికారులు

నరసన్నపేట: ఉదయ నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతీ పనిలోనూ పాలిథిన్ ఒక భాగమైపోయింది. బయట నుంచి ఇంటికి ఏది తీసుకెళ్లాలన్నా పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నాం. వాటివలన పర్యావరణానికి ముప్పు అని తెలిసినా అన్నింటికీ ఈ కవర్లనే వాడుతున్నాం. వాస్తవానికి పాలిథిన్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. అయినా ఎక్కడా అమలు కావడం లేదు. గతంలో తనిఖీలు చేసిన పంచాయతీ సిబ్బంది, ఇప్పుడు పూర్తిగా వదిలేశారు. ఫలితంగా పాలిథిన్ సంచులను మార్కెట్‌లో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

యథేచ్ఛగా వినియోగం

పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు అన్ని ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా సాగుతున్నాయి. సరాసరిన ప్రతిరోజూ రెండు టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నట్లు అంచనా. గతంలో 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై నరసన్నపేట పంచాయతీ పరిధిలో నిషేధం అమలు చేశారు. వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. తనిఖీలు చేసి దొరికిన కవర్లను సీజ్ చేసి ధ్వంసం చేశారు. దాదాపు కొన్ని నెలల పాటు నిషేధం కొనసాగడంతో వినియోగం బాగా తగ్గింది. అయితే ఇప్పుడు మరలా కథ మొదటికి వచ్చింది. దుకాణాలు, చికెన్ సెంటర్లు, బేకరీలు, హోటళ్లు, కర్రీ పాయింట్లలో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీంతో రోడ్ల పక్కన, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి.

జీవరాశికి ముప్పు

పాలిథిన్ వ్యర్థాలు పెరిగిపోవడం వలన జీవరాశికి ముప్పు ఏర్పడుతోంది. ముఖ్యంగా ఆవులు, మేకలు వంటి మూగజీవాలు పాలిథిన్ కవర్లు తిని మృత్యువాత పడుతున్నాయి. ఈ కవర్లు భూమిలో కలవడానికి అనేక సంవత్సరాలు పడుతుంది. దీని వలన భూగర్భ జలాలు అడుగంటే ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వెళ్లడం వలన పాలీ ఇథాలిన్, పాలీ హిస్టరీస్ వంటి రసాయనాల కరిగి ఆహార పదార్థాల్లో కలిసి పోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని వలన కేన్సర్, తదితర వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

నిషేధించాలి



పాలిథిన్ నిషేధం పక్కాగా అమలు చేయాలి. దీని వలన పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లుతుంది. అలాగే మానవ మనుగడకు ఎంతో ప్రమాదం పొంచి ఉంది. ప్లాస్టిక్‌ను ఎంత తొందరగా నిషేధించి వాడకాన్ని తగ్గించగలిగితే అంత మంచిది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలి. నిషేధం అమలు మరింత కఠినంగా ఉండాలి.

– గొలివి సుజాత, వైద్యాధికారి, ఉర్లాం పీహెచ్‌సీ

చర్యలు తీసుకుంటాం



గతంలో అన్ని పంచాయతీల్లోనూ ప్లాస్టిక్ నిషేధం అమలు చేశాం. దాడులు చేసి జరిమానాలు విధించాం. కానీ ఇప్పుడు మళ్లీ వినియోగం బాగా పెరిగింది. మా దృష్టికి కూడా వచ్చింది. దీనిపై మరోసారి పంచాయతీ పాలక సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. అలాగే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం.

– ద్రాక్షాయణి, ఈవో, నరసన్నపేట

ఇంటింటా కుళాయి జగన్ చొరవే

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: రాష్ట్రంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడం, తాగునీరు అందించడం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవేనని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ కార్యక్రమానికి తమ హయాంలో అధిక ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. పథకంలో భాగంగా 2023–24 సంవత్సరంలో జరిగిన పనుల్లో దేశంలోనే మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ప్రైవేట్ మద్యం షాపులు ద్వారా గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోందని మండిపడ్డారు. మద్యం మీద చూపించిన శ్రద్ధ తాగునీరు, సాగునీరు మీద కూటమి ప్రభుత్వం చూపించకపోవడం బాధాకరమన్నారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కేవలం కక్షపూరిత రాజకీయాలతోనే కాలం నెట్టుకొస్తున్నారని దుమ్మెత్తి పోశారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి మణి

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో ఉన్న కేజీబీవీ సిబ్బంది పనితీరుపై స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీని శుక్రవారం జూనియర్ జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా వంట పాత్రలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాటు వంట చేస్తున్న ప్రదేశంలో పారిశుధ్యం లోపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాటు డోర్లు లేకపోవడాన్ని గుర్తించారు. సీసీ కెమెరాలు అన్ని సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పీవో రాధికను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. కేజీబీవీ సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపయోగం



కొత్తూరు మండల కేంద్రంలో ఆర్అండ్‌బీకి చెందిన విశ్రాంతి బంగ్లా నిరుపయోగంగా ఉంది. కోట్లాది రూపాయిలు విలువ చేసే ఈ బంగ్లాతో పాటు పరిసర స్థలం నిరుపయోగంగా మారింది. ఇప్పటికే కొంత భూభాగం అక్రమణకు గురయ్యింది. అంతే కాకుండా ఈ స్థలం చెత్తతో డంపింగ్ యార్డుగా మారుతోంది. అందువలన సంబంధిత అధికారులు స్పందించి ఆర్అండ్‌బీ బంగ్లా మరమత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

– కొత్తూరు

అధ్వానం



మేజర్ పంచాయతీ హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అలికాం–బత్తిలి ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో నిత్యం వాహనాలు ఎక్కువగా తిరుగుతుండడంతో చిన్న గుంతలే పెద్ద గుంతలుగా మారుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువలన అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– హిరమండలం

– మలుపు.. ప్రమాదాల పిలుపు



రొట్టవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో పాలవలస వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. ఈ రహదారిలో ఇసుక వాహనాలు అధిక స్పీడుతో వందలాదిగా ప్రయాణాలు చేస్తుంటాయి. అయితే ఇక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అందువలన అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

పట్టించుకోరేం..?



మేజరు పంచాయతీ నరసన్నపేటలో మెయిన్ రోడ్డు నుంచి బండి వీధికి వెళ్లే మార్గంలో ఉన్న మంచినీటి బోరు ఫ్లాట్‌ఫారం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. బోరు వినియోగం కూడా బాగా తగ్గింది. మూడు నెలల నుంచీ ఇలాగే ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి ఫ్లాట్‌ఫారం మరమ్మతులు చేపట్టాలని, బోరు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

పశు గణనకు సహకరించాలి

- పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఆనందరావు



పాతపట్నం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



ఆమదాలవలస: పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: పోస్టర్ అవిష్కరిస్తున్న అధికారులు

ఆమదాలవలస: దేశవ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన పశు గణనకు ప్రజలందరూ సహకరించాలని ఆమదాలవలస పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రోణంకి ఆనందరావు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌తో కలిసి 21వ అఖిల భారత పశు గణన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమదాలవలస క్లస్టర్ పరిధిలోని మొత్తం కుటుంబాలకు సంబంధించిన పశువుల వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. పశు సిబ్బంది గృహ సందర్శనకు వచ్చే సమయంలో తమ వద్ద ఉన్న పశువులు, కోళ్ల సంఖ్యపై సరైన సమాచారాన్ని అందజేయాలని సూచించారు. పశు గణనలో భాగంగా గణన ప్రక్రియ పూర్తయినట్లు గుర్తుగా ప్రతీ ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు అంటిస్తారని తెలిపారు. ఈ పశు గణన భవిష్యత్ ప్రణాళిక, విధాన రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు.

జీవనోపాధికి తోడ్పడేలా చర్యలు

పశు గణన ప్రక్రియ పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాలు సమర్థవంతంగా రూపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ భారత దేశంలో పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరు అని, ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. భూమిలేని కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా పని చేస్తుందన్నారు. పశు పోషణ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ఆదాయ వనరుగా ఉంటుందని తెలిపారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పశు గణన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు తదితర 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఆమదాలవలస పశు గణనలో 9 మంది విషయ సేకరణదారులు, ముగ్గురు సూపర్‌వైజర్లు ఉంటారన్నారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పట్టణ వార్డుల్లో గృహ, గృహేతర వ్యక్తుల నుండి సమాచారం సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, పీవీవీకే రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ గురువుబెల్లి నాగేశ్వరరావు, బొడ్డేపల్లి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పక్కాగా పశు గణన చేపట్టాలి

సరుబుజ్జిలి: పశు గణన సక్రమంగా చేయాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని షళంత్రి గ్రామంలో అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ, పశువైద్యాధికారి సతీష్ పాల్గొన్నారు.

పాతపట్నం: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశు గణన సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ కరుణాకరరావు, విశ్రాంత ఎంపీడీవో చిరంజీవి, పశు వైద్యులు శ్రీవాణి, అనిల్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నరసన్నపేట: విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమని అంబేడ్కర్ యూనివర్సిటీ బీసీడీఈ సమన్వయకర్త ప్రొఫెసర్ బి.అజయకుమార్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ త్రు ఎడ్యుకేషన్) అంబేడ్కర్ యూనివర్సిటీ సంయుక్తంగా స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల్లో లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం)పై విద్యార్థులకు శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి సూచించారు. శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.అప్పారావు, కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

ఆమదాలవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రోణంకి వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు విధిగా సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని స్పష్టం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పొందూరు: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని కింతలి, తాడివలస బీసీ బాలుర వసతి గృహాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. వసతి గృహాన్ని, పరిసరాలను, సిబ్బందితో పాటు విద్యార్థులు పరిశుభ్రంగా ఉంచేలా వార్డెన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులను విడిచిపెట్టి చదువు కోసం హాస్టల్స్‌కు వచ్చిన విద్యార్థుల ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారికి సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కింతలి, తాడివలస వసతి గృహాలు అద్దె భవనాల్లో ఉండడంతో సొంత భవనాలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. జడ్జితో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

బాణసంచా తరలింపుపై నిఘా

సారవకోట: మండలంలోని అర్లి టోల్‌గేట్ దగ్గర సారవకోట పోలీసులు అక్రమ బాణా సంచా, గంజాయి తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారంగా టోల్‌గేట్ దగ్గర శుక్రవారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ రోడ్డు ఒడిశా రాష్ట్రానికి కలుపబడి ఉండడంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారించాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న శ్రీకాంత్

నరసన్నపేట: గర్భిణుల్లో రక్తహీనతను నివారించాలని జిల్లా నోడల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తామరాపల్లి సచివాలయంలో శుక్రవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంతమంది, వీరిలో రక్త హీనతతో ఉన్నవారు ఎంతమంది ఉన్నారని డాక్టర్ శిరీషను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా రక్త హీనతతో ఉన్న వారి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. గుర్తించిన వారికి పోలిక్ యాసిడ్ మాత్రలు ఇచ్చి, తగు వైద్య సూచనలు, ఆహార నియమాలు వివరించాలన్నారు. అలాగే క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. వీరి చికిత్సలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. శిబిరంలో రోగులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ఆయనతో పాటు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, 104 ఈవో లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

రీసర్వే సదస్సులతో రైతులకు మేలు



ఆమదాలవలస: మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు



బూర్జ: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమదాలవలస: ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ రీసర్వే సదస్సులతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ రాంబాబు అన్నారు. మండంలోని కొత్తవలస గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి రీసర్వే సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూముల వివరాలను సరి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చిందని, దీనిలో భాగంగా గతంలో సర్వే అయినటువంటి గ్రామాల్లో భూముల వివరాలు నమోదు చేసేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా సర్వే అయినటువంటి గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఆ తర్వాత మిగతా గ్రామాల్లో రైతులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తవలస గ్రామంలో రీసర్వే అయినప్పటికీ రైతులకు అందించే పట్టాదారు పాస్ పుస్తకాలు తప్పులు తడకలతో ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మళ్లీ సర్వే నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని పెద్దపేట గ్రామ సచివాలయం పరిధిలో భూ రీసర్వే సదస్సులపై తహసీల్దార్ వై.వి.పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సదస్సుల్లో భాగంగా రైతుల సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆనెపు రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యుడిగా గిరిజా శంకర్



పొందూరు: ఏపీ రాష్ట్ర పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా పొందూరుకు చెందిన గుంటుకు గిరిజాశంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న గిరిజాశంకర్‌ను పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మూడు సంవత్సరాల పాటు గిరిజాశంకర్ ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయన నియామకంపై మాజీ సర్పంచ్ కోరుకొండ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కోరుకొండ సాయికుమార్, డాక్టర్ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు.

పెరగనున్న రేషన్ డిపోలు

కొత్తూరు: మండలంలో మూడు రేషన్ డిపోలు పెరగనున్నట్లు సివిల్ సప్లయ్ డీటీ భీమారావు శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు 62 డిపోలు ఉండగా, పెరిగిన డిపోలతో మొత్తం 65 డిపోలు ఇక నుంచి ఉంటాయన్నారు. ప్రభుత్వం 800 రేషన్‌కార్డులు దాటిన డిపోలను విభజించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఈ మేరకు మండల కేంద్రంలోని కొత్తూరు రేషన్ డిపో-1, కొత్తూరు రేషన్ డిపో-3, కొత్తూరు రేషన్ డిపో-54లు 800 కార్డులు దాటి ఉన్నందున ఈ మూడు డిపోలను మాత్రమే విభజించడం జరిగిందని చెప్పారు. విభజించిన డిపోల ప్రతిపాదనను అధికారులకు పంపించినట్లు తెలిపారు.